# స్వయంకృతాపరాధం

## వి. రామారావు

అది రాజకీయపురం. గ్రామ వాసులకు రాజకీయాలు పెట్టింది పేరు. చంటి వారికి ఉగ్గుపాలతో నే రాజకీయాలు పట్టిస్తారు. వారిని లాలన చేసేటప్పుడు పార్టీ పాటలు లాలి పాటల వలె పాడతారు. చిన్ని పిల్లలకు పార్టీ నాయకుల పేర్లు పెట్టి, పార్టీ యూనిఫారం ధరింప చేస్తారు సందులకు, గొందులకు నాయకుల సతుల,సుతుల నామధేయాలు పెట్టి వారికున్న గౌరవాన్ని బయట పెడతారు. పెద్దలకు ఉదయము, సాయంత్రము పార్టీ సుద్దులు, ప్రార్థనలు నిత్యకృత్యాలు.

పార్టీ పేపర్లతో గ్రామం అంతటా ఉదయము కళకళలాడుతూ వుంటుంది. ప్రతి ఇంటా మరి నాయకుల పెద్ద పెద్ద ఫొటోలు వ్రేలాడుతూ వుంటాయి. కాయకష్టము చేసి పార్టీ నిధులకు సానుభూతి పరులు ధనము ప్రోగుచేసి ఇస్తే, సునాయాసంగా ప్రోగు చేసే మనుష్యులు కూడా ఆ గ్రామంలో ఉన్నారు. జన్మ దినోత్సవాలు, సంతాప సభలు హోరాహోరీగా ఒకే బజారులో ఎదుటి పక్షాల వారివి ఎదురు బొదురుగా జరుగుతూ వుంటాయి. ఇంటింటాముగ్గులతో పార్టీ గుర్తులు వేయగా ప్రత్యర్థులు కాల రాస్తారు

రోగము వచ్చినపుడు ఆ యా పార్టీల డాక్టర్లను, కోర్టు వ్యవహారాలకు ఆ యా పార్టీల లాయర్లను కలుసుకోవటం వారికి రివాజు. తండ్రికి తర్పణాలు వదలినా, వదలక పోయినా పార్టీ నాయకులకు విడువక ప్రతి ఏటా పిండాలు పెట్టటం వారి ఆచారం. గ్రామాలలో దేవాలయాల తలుపులు తెరవక పోయినా పార్టీ ఆఫీసు తలుపులు తెల్లవార్లూ తీసే ఉంటాయి.

ఆడ వారికి మంగళసూత్రాలు పార్టీ గుర్తులు మంగళసూత్రాలు కట్టేటప్పుడు "పార్టీకి జై" "జోహారు" అను నినాదాలు బ్రాహ్మణుల మంత్రాలను మించిపోయేవి. వివాహాలు పార్టీ సభ్యులలో మాత్రమే జరిగిపోయేవి ఒక పార్టీ సభ్యులు ఇతర పార్టీల సభ్యులతో కనీసం భోజనాలు కూడా చేయరు. పెళ్ళిళ్ళకు పార్టీ తోరణాలు భారీగా కట్టేవారు. పెళ్ళిళ్ళకు పార్టీ తోరణాలమధ్య, పార్టీ ఊరేగింపుల మంగళవాద్యాలు, పార్టీ పాటల సాహిత్యము వినవలసినదేకాని చెప్పనలవికాదు. ఆడపాదడపా ప్రాణాలు బలవంతంగా తీయుదురని ప్రక్క ఊరి ఆడపిల్లల్ని ఈ ఊరివారికి ఇవ్వరని ప్రతీతి.

రాజకీయపురంలో నాయకుల విగ్రహాలు కోకొల్లలు. ఎల్లప్పుడూ వాటి చేరువలో పార్టీ మీటింగులు భారీఎత్తున సాగుతూ ఉంటాయి. ప్రొద్దుతిరుగుడు పూవు మాదిరి ఛోటానాయకులు పదవి వదలక నాయకుల కొసం పట్నాలు తిరుగుతూ ఉంటారు.

* * *

మరల పెద్దమ్మవారి జాతర వచ్చినట్లు రాజకీయ పురానికి పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. ఆ గ్రామంలో బలమైనవర్గాలు రెండు గలవు.

ముసలయ్య ముఠా ముందు చెప్పినా గోవిందయ్య గ్రూపును చిన్న చూపు చూడ కూడదు. మొదటి ఎన్నికలలో ముసలయ్య ముఠా పదవికి వస్తే, మొన్నటి ఎన్నికలలో గోవిందయ్య గ్రూపు తాచరికము చేపట్టింది.

ప్రెసిడెంటు పదవికి ఆగ్రామంలో బొమ్మా-బొరుసు వేసి పదవి నిర్ధారణ చేయవలసి వచ్చేది. ఎందుకంటే ఆ పార్టీ వారు పలుగురు గెలిస్తే, ఎగస్పార్టీవారు కూడా పలుగురు గెలిచేవారు. అది ఆ గ్రామానికి పట్టిన రాజకీయ జబ్బు.

ముసలయ్యకు మొదటినుంచి నాంచారమ్మ బ్లాను, దరిద్రనారాయణ దర్బారు అండగా నిలిచారు పైగా వారు పెట్టుబడులు కుమ్మరిస్తారు.

గోవిందయ్య గ్రూపును పీక్కు చాలని సంఘం, ఇల్లులేని సంఘం ఇండైరెక్టుగా బలపరుస్తున్నారు.

గొర్రెపోతు తగాదాలో ఇరుపక్షాలకు బుర్రలు బద్దలయ్యాయి పెద్ద చెరువుగట్టు తగాదా సుప్రీమ్ కోర్టులో నడుస్తోంది. కొత్త పంటలు భస్మము అగుటతో ఇరుపక్షాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. ఇటువంటి సమయంలో పంచాయతీ ఎన్నికలు ఆసన్నమయ్యాయి.

ముసలయ్య ముఠా తరపున ప్రెసిడెంటు పదవికి వేలిముద్రయ్యను నుంచోబెట్టారు. ముద్రయ్యను ఎన్నికలలో గెలిపించటానికి పార్టీ రథం కదిలింది. "భయంలేదు" అన్నట్లు ఏకైక నాయకుడు భద్రయ్యను పట్నంనుంచి పంపారు.

భద్రయ్య పార్టీ సభ్యులను బలపరుస్తూ ప్రజల నుద్దేశించి మాట్లాడటానికి సతీ సమేతంగా రాజకీయపురం విచ్చేశారు.

"నీవే తల్లివి-నీవే తండ్రివి-నీవే గురుడవు. నీవే సఖుడవు - నీవే మా తోడు నీడ" అనే బానర్లతో గ్రామం అంతా నిండి పోయింది.

ఆ గ్రామంలో చూడవలసిన దృశ్యాలు రెండు. మొదటిది చేపల చెరువు. రెండవది పాటిదిబ్బ.

చేపల చెరువును సందర్శించి, చేపల వానితో ఒక ఫొటోను శ్రీశ్రీశ్రీ భద్రయ్య నాయకులు దిగారు. చేపలవాడు నాయకులను చూచి బెదరి పారిపోబోగా, వానికి పార్టీ నిధినుంచి నూట పదహారు రూపాయలు ముట్టచెప్పి అతి కష్టంమీద ఫొటోకు ఒప్పించారు. చేపల చెరువుదగ్గర శ్రీ భద్రయ్య మాట్లాడుతూ తాను బాల్యములో "చేప-కొంగ" కథ చదివితి నని పరమ సత్యము చెప్పి పార్టీ భక్తులను విస్మయంలో ముంచెత్తారు. తమ ఉపన్యాసాన్ని చేపలవానితో దిగిన ఫొటోను పత్రికలలో ప్రచురించుటకు శ్రీ భద్రయగారు అంగీకరించారు.

తర్వాత పాటిదిబ్బకు హుటాహుటిగా పార్టీ బృందం బయలుదేరింది. అచ్చట గ్రామపార్టీ మాజీ అధ్యక్షుని ఖననం చేశారు. శవం ఊళ్ళో పాతటానికి గోవిందయ్య గ్రూపు అడ్డు చెప్పగా, సుప్రీం కోర్టులో ముసలయ్య ముఠా గెలిచింది. అప్పటినుంచీ గ్రామపార్టీ మాజీ ప్రెసిడెంటును స్మరిస్తూ పెద్ద గులాబీ దండలు పాటిదిబ్బమీద వేయటం గ్రామానికి వచ్చిన రాజకీయ నాయకులకు పరిపాటి.

శ్రీ భద్రయ్యకు పూలదండలు వేయుటకు భక్తులు మధ్యలో ఆపుట వలన, బ్యానర్లు శ్రీవారు చదువుటవలనను అనుకున్న సమయానికి నాయకులు మీటింగుకు వెళ్ళలేకపోయారు.

పైగా మధ్యలో ఒక కొత్త మైలురాయికీ శంఖుస్థాపన చేయవలసింది; ఒక గంట ఆలస్యంగా శ్రీ భద్రయ్య ఉపన్యాస వేదికనలంకరించారు.

బహిరంగ సభలో జనం కిటకిటలాడుతున్నారు. భద్రయ్యకు పార్టీలో అన్నివర్గాల తరపున, అన్ని కులాల తరపున గ్రామంలో అన్ని వృక్షాల తరపున, జంతువుల తరపున పూలదండలు లెక్క తప్పకుండా వేశారు. భద్రయ్య భారీ మనిషి ఆయన బట్టతల దేశంలోని నిరక్షరాస్యత అంతా ఒకచోట కేంద్రీకరించినట్లుంటుంది. సృష్టి తల క్రిందులు చేయుటకు కృష్ణ భగవానుడు మురళి ధరించినట్లు శ్రీ భద్రయ్య చిన్న కర్రను చేతితో పుచ్చుకున్నారు. పాపం, తమ చిహ్నమైన తోరణాకోలను నాయకుల వారికి బహుమతిగా ఇస్తోంటే. వ్యవసాయదారులు గుడ్లు అప్పచెప్పి గుటకలు మింగుతూ చూస్తున్నారు.

మహాసభ జయప్రదంగా సాగుతోంది. శ్రీ భద్రయ్య ఉపన్యాసం మొదలుపెట్టారు.

"ఈ ఎన్నికలలో ప్రజాబంధువు శ్రీ వేలి ముద్రయ్యను మీరంతా గెలిపించాలి. ఒకే పార్టీని మూఢంగా నమ్మక ఏ పార్టీ బాగుంటే ఆ పార్టీలోకి రావటం వారి ప్రత్యేకత. క్రిందటిసారి ఎన్నికలలో ఇప్పటి ప్రెసిడెంట్‌ను గెలిపించి వారి గుప్తధనాన్ని చవి చూశారు

మన పార్టీ గ్రామానికి చేసినవి ప్రత్యర్థులు నేలకూల్చారు. వారు చేసిన పనులు మేము కూల్చాము.

మళ్ళీ మమ్మల్ని గెలిపిస్తే మేము చేసిన పనులు నేలకూల్చరు. చెడగొట్టరు గ్రామానికి ఎంతో లాభం వస్తుంది.

ఆయన గుర్తు మీకు తెలుసు. అది మామిడి టెంక. మాటలా. ప్రఖ్యాత సినీ నటి దవనం మామిడి టెంక కథా వస్తువుగా వెండి తెరకు సినిమా ఎక్కించింది. ప్రజలు అంటే మీరు ఆ సినిమాకు రజతోత్సవాలు జరిపారు

మన విశ్వకవి వేమన మామిడికాయ పచ్చడిని ఏమన్నాడో తెలుసా.

"ఆంధ్రదేశ మందు ఆవకాయకు సాటి
పచ్చడేదికలదు ప్రముఖులార
కొత్త ఆవకాయ కోరిన పదవిచ్చు
విశ్వదాభిరామ వినురవేమ"

ఇది శ్రీ భద్రయ్య రికార్డు స్పీచ్ ఆరు గంటల సేపు అనర్గళంగా జాతీయ, అంతర్జాతీయ సమస్యలను వివరిస్తూ. వేలి ముద్రయ్యను గెలిపించవలసిన ఆవశ్యకతను వివరిస్తున్నారు.

ఇంతలో కరెంటు పోయింది. వేదిక పైకి ఎవరో ఏదో విసిరిన శబ్దం,చప్పట్లలో కలిసిపోయింది, శ్రీ భద్రయ్యకు బలమైన గాయం తగిలి స్పృహతప్పింది.

# పండుగ భయం

స్వాగతమో సిద్ధార్థీ తీర్చేవా నా ఆర్తి
నా వరకూ కాళయుక్తి నిరాసక్తంగానే నిష్క్రమించింది
ప్రతి పండుగ వచ్చేది ఏడాదికి ఓసారె
పండుగ వస్తోందంటే నా ఎదలో అలజడి
నెలాఖరున పండగైతే నా పని ఇక సరి సరి
పండుగ పూటైనా పరమాణ్ణం వండొద్దా? అంటుంది "ఇంటిది"
పైనెల్లో పైసలు పట్టుకోమంటూ "అడవాన్సు" అడుగుతుంది "పనిది"
క్రొత్త సంవత్సరం "బోణీ" అరువు కుదరదంటాడు లింగిసెట్టి
అందరికీ పండుగే గదా భాయ్ అంటాడు అప్పిచ్చే మిత్రుడు
పండుగ జీతం కోతలో, కోయిలమ్మ కూతలు కలుస్తాయ్
వచ్చేనెల బడ్జెట్ ఎడ్జెస్ట్‌మెంట్ కోసం మెదడంతా తికమకోయ్
ఈ ఉగాది నుండైనా మా లాంటి వారికి మంచి రోజులు రావాలని
మాలాంటి బ్రతుకుల్లో పండుగ భయం పోవాలని
వేడెదనో సిద్ధార్థీ నేనిక నీ అభ్యర్థి.

—ఎమ్. ఉషారాణి

వెంటనే చిన్నకారులో పక్క పట్నాలకు నాయకుణ్ని తరలించారు ఈ గల్లంతులో ప్రజా సమూహం చెల్లాచెదరైంది. స్టేజీ మీదకు విసిరిన వస్తువును పార్టీవారు భద్రపరిచారు. ముమ్మాటికి ఇది ప్రతిపక్షాల కుట్ర అని నమ్మి, దీనిపై విచారణ జరపాలని పార్టీ అధిష్ఠాన వర్గం నిర్ణయించింది.

♦ ♦ ♦

పెద్ద పెట్టెకు జండా చుట్టి విసిరిన వస్తువును పెట్టెలో పెట్టి జయ జయ ధ్వానాల మధ్య రాజధానికి పంపారు. మన దేశంలో నున్న పెద్ద శాస్త్రజ్ఞుల చేత పరిశోధనలు జరిపించారు. ఆసిడ్సు వాడారు. ఆల్కహాల్సు వాడారు, కాని లోగుట్టు తెలిసికొనలేకపోయారు.

చివరకు ఈ సమస్యను నేర పరిశోధన సంస్థకు అప్ప చెప్పారు వారు పోలీసు కుక్కలను వాడారు.

ఈ కేసు కొరకు వారు క్రొత్త శాఖను ప్రారంభించారు. క్రొత్త పోస్టులు సృష్టించారు. ప్రమోషన్లు అధికారులకు వచ్చినాయి కాని ప్రగతి శూన్యం.

గత్యంతరము లే పార్టీ వారు ఈ పెట్టెను విదేశాలకు పంపాలని నిర్ణయించారు కొన్ని లక్షలు అవుతుందని అంచనా వేశారు ఇతర దేశాల నుండి అప్పు తీసుకొని, ఈ ఖర్చు భరించాలని నిర్ణయించారు. దీని కొరకు విదేశీ నిపుణులతో కూడిన కమిటీని ఏర్పరచారు. కమిటీలోని సభ్యులందరు విదేశస్థులగుటచే, కమిటీనిర్ణయాన్ని తుచ తప్పకుండా అమలు జరపాలని దేశీయులు అభిప్రాయపడ్డారు.

ఒక పెద్ద విమానంలో సెక్యూరిటీతో బ్యాండు మేళాల మధ్య పార్టీ సభ్యుల, బంధు మిత్రుల హర్షధ్వానాల మధ్య విమానం విదేశానికి బయలుదేరింది.

అనుకున్న ప్రకారం పొరుగు మిత్ర దేశంలో విమానం సకాలానికి దిగింది. లాంఛనాలతో, పూల దండలతో, అధికార, అనధికార ప్రముఖులతో, ప్రభుత్వ మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం లభించింది.

ఆ దేశంలో నున్న ప్రముఖ యువశాస్త్రవేత్తలకు ఆ పెట్టెను అప్ప చెప్పారు. వారి ఆదేశానుసారం ఈ పెట్టెను కుజగ్రహంలో మూడు నిద్రలు చేయించారు భూమి చుట్టు సెకనుకు లక్షసార్లు తిప్పారు. రాకెట్టులో చంద్ర మండలానికి పంపారు. చంద్రునికి అతిథిగా ఒక పూట ఉంచారు. చంద్రునికి ఈ రాజకీయపు కంపు గిట్టక భూమి మీదకు రాకెట్టు వస్తుంటే దాని లోనికి విసిరాడు. అది పసిఫికు మహా సముద్రంలోని పెద్ద ఓడ లోకి అర్ధరాత్రి పూట రహస్యంగా దిగింది.

కాని ఏం లాభం. ఇతర దేశస్థులకు రాజకీయ పురంకుశ్ము అంతుబట్టలేదు అసలు సంగతి ఎవరూ పసికట్టలేక పోయారు. పార్టీ అడిగిన ప్రశ్నలకు మిత్ర దేశం సమాధానం ఇవ్వలేకపోయింది. పెట్టెను రాజకీయపురం భద్రంగా తిరిగిపంపారు.

పార్టీ నాయకులకు చెమటలు గంగా యమునలలాగ వంటిమీద ప్రవహిస్తున్నాయి. అసలు కీలకం తెలుసుకుంటే ఆది ఆసరాగా తీసుకుని వచ్చే ఎన్నికలలో గెలువవచ్చు. అందుకే వారు ఎన్నో కష్టాలుపడుతున్నారు. సర్వం త్యాగం చేస్తున్నారు.

చివరకు అన్ని దేశాలు కలిసి ఒక అంతర్జాతీయ సంస్థకు పంపుదామని నిశ్చయించారు. అచ్చట అన్ని కుటిల రాజకీయాలు తెలిసినవారు తప్పకుండా దొరుకుతారని ఒక మాజీ బుర్రకు తట్టింది.

ఆ సంస్థకు పార్టీ తరపున ఆహ్వానం వెళింది. వారు మన దేశం వచ్చారు. వారు రాజకీయపుటుద్దండులు. పెట్టె చూశారు. వెంటనే స్ఫురణ వచ్చిన భద్రయ్యకు ఆ వస్తువు చూపాలని నిర్ణయించారు.

ఆ వస్తువు చూసిన భద్రయ్య బాధతో "ఇదే మరేమి కాదు. వట్టిరాయి. పూర్వం ఎన్నికలకు వచ్చినపుడు ఈ రాయికి నేనే శంఖుస్థాపన చేశాను. తర్వాత మా పార్టీ గాని ఏ ఇతర పార్టీగానీ దాని అతీ గతీ పట్టించుకోలేదు. అందుకోసం ఈ రాయి శత్రు రాళ్ళతో కలిసింది చివరకు నాప్రాణమే తీయబోయింది" అంటూ లంక పొగాకుదగ్గు ఖంగున దగ్గాడు.

తర్వాత "ఇది స్వయంకృతాపరాధం బాబూ" అని సణగటం కూడా నెమ్మదిగా వినిపించింది.

★




